సాక్షి నిర్మల్

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



ఐటీడీఏ పీవోగా వచ్చేదెవరో?

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వరుణ్‌రెడ్డి నిర్మల్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు కొత్త పీవోగా ఎవరు నియమితులవుతారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 8లో▸

సీఐల బదిలీ

భైంసాటౌన్: మల్టీజోన్-1 పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా జిల్లాలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ పర్స రమేశ్‌ను కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని తిమ్మాపూర్ సర్కిల్‌కు బదిలీ చేయగా, ఖానాపూర్ సీఐ అజయ్‌బాబు ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. భైంసా పట్టణ సీఐ ఎం.ప్రవీణ్‌కుమార్‌ను జగిత్యాల జిల్లా కోరుట్ల సర్కిల్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎల్.శ్రీనుకు బాధ్యతలు అప్పగించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2 / 16.3

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రత తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాలల హక్కులు కాపాడాలి



మాట్లాడుతున్న చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్

నర్సాపూర్(జి): బాలల హక్కుల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ గంగభూషణ్ అన్నారు. మండల కేంద్రంలోని మల్లికార్జున మహిళా సంఘ భవనంలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైల్డ్‌లైన్ సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఒంటరిగా బాధపడుతున్న, ఆశ్రయం అవసరమైన, ఆర్థిక దోపిడీకి గురవుతున్న బాలకార్మికులు కనిపించినప్పుడు 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం గురుచరణ్, సీసీ శ్రీనివాస్, చైల్డ్‌లైన్ కౌన్సిలర్ సుప్రియ, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధిద్దాం



మాట్లాడుతున్న ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

దస్తురాబాద్: బహుజన రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ కోరారు. మండలంలోని బుట్టాపూర్, మున్యాల, గొడిసిర్యాల, దస్తురాబాద్ గ్రామాల్లో మంగళవారం బహుజన రాజ్యాధికార యాత్రను చేపట్టారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బహుజనులకు రాజ్యాధికారం వచ్చినప్పుడే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బహుజన రాజ్యస్థాపన కోసం కృషిచేయాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో బీఎస్పీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బన్సీలాల్, రాజశేఖర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు



మాట్లాడుతున్న దేవీ మురళి

లక్ష్మణచాంద: సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో బాల్య వివాహాలపై బాలల సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, తెలంగాణ సాంస్కృతిక శాఖ, బాలల హక్కుల పరిక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బాలల హక్కుల పరిక్షణ కమిటీ అధికారి దేవి మురళీ హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలు వివరించారు. బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కళాకారులు బాలల హక్కులు, బాలకార్మిక వ్యవస్థపై పాటల ద్వారా అవగా హన కల్పించారు. కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ లక్ష్మి రాజనర్సయ్య, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు అనిల్, కళాకారులు సుదర్శన్, సుధాకర్, రమేశ్, లక్ష్మణ్, జితేందర్, తస్లీమా, మాధవి, శ్రీలత, రాజలింగు పాల్గొన్నారు.

రీసైక్లింగ్ దందాను అడ్డుకోండి

- వ్యవసాయానికి కోతలు లేని కరెంటు ఇవ్వాలి
- జెడ్పీ సమావేశంలో సభ్యుల డిమాండ్
- ఎరువుల అధిక ధరలపై ఆందోళన
- విచారణ చేయాలని కలెక్టర్‌కు ఐకేరెడ్డి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు

నిర్మల్ రూరల్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చాలారోజుల తర్వాత వాడీవేడిగా జరిగింది. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ వరుణ్‌రెడ్డి మొదటిసారి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో బియ్యం రీసైక్లింగ్ దాందాను అధికార పార్టీ జెడ్పీటీసీ మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ అక్రమ దందాను అడ్డుకోవాలని కోరారు. వ్యవసాయానికి కరెంటు కోతలపై బీజేపీ జెడ్పీటీసీ ఆందోళన వ్యక్తం చేశారు. అప్రకటిత కోతలతో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. చాకిరేవు గ్రామ పరిస్థితిపై కూడా సభలో చర్చించారు. సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. కేంద్రం రాష్ట్రంపై సవతి ప్రేమ చూపుతోందని ఆరోపించారు. ఉపాధి హామీ కూలీలకు అన్యాయం చేస్తోందని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటలు కరెంటు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోజుకు రూ.37 కోట్లతో విద్యుత్ కొనుగోలు చేస్తోందన్నారు. నెలకు రూ.1000 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. కరెంటు కోతలపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ఏప్రిల్ నుంచి రెండోదఫా గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఫిబ్రవరి 15 నుంచి జిల్లాలోని పదో తరగతి విద్యార్థులందరికీ ఉదయం, సాయంత్రం వేళల స్నాక్స్, సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాగి ముద్ద అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో గతేడాది కంటే ఈసారి 15 వేల ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగిందని వెల్లడించారు. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చాక 90% రైతుల సమస్యలు తీరాయన్నారు. రోడ్లపై కేజీ వీల్స్ తిరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. తాము కూడా మిషన్ భగీరథ నీళ్లు తాగుతున్నామని మంత్రి తెలిపారు.

కలెక్టర్‌కు సన్మానం..

సమావేశం ప్రారంభం కాగానే నూతనంగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి సమావేశానికి హాజరైన కలెక్టర్ వరుణ్‌రెడ్డికి సభ్యులు ఘన స్వాగతం పలికారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్య, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సాగరీబాయి, గ్రంథాల సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లాస్థాయి అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన ముఖ్యాంశాలు..

- మన ఊరు– మన బడి కార్యక్రమంలో ద్వారా ప్రారంభించిన బడులకు ప్రజాప్రతినిధులను ఎందుకు పిలవలేదని సోన్ జెడ్పీటీసీ జీవన్ రెడ్డి, సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి డీఈవో రవీందర్‌రెడ్డిని ప్రశ్నించారు. ఆహ్వాన కమిటీ తప్పిదంతో సమాచారం ఇవ్వలేకపోయామని, భవిష్యత్తులో జరుగకుండా చూస్తామని డీఈవో తెలిపారు.
- యూరియా, డీఏపీతోపాటు ఇతర ఎరువులను జిల్లాలో ఫెర్టిలైజర్ షాపుల యజమానులు అధిక ధరలకు అమ్ముతున్నారని ముధోల్ జెడ్పీటీసీ సరోజ, సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయించాలని మంత్రి కలెక్టర్‌కు సూచించారు.
- ముధోల్ ఏడీఏ ఇంద్రసేన్ 14 నెలలుగా విధులకు రావడంలేదని ముధోల్ జెడ్పీటీసీ ఎసరోజ తెలిపారు. స్పందించిన మంత్రి అతనిపై శాఖపరమైన విచారణ జరిపించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.
- కడెం ప్రాజెక్టులో కాంట్రాక్టర్ నాణ్యతలేని చేపపిల్లలు వదిలాడని, అతని కాంట్రాక్టు రద్దుచేసి చర్య తీసుకోవాలని కడెం ఎంపీపీ అలెగ్జాండర్ మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి విచారణ జరిపి సదరు కాంట్రాక్టర్‌పై చర్య తీసుకుంటామని తెలిపారు.

‘చాకిరేవు’ బాధలు తీర్చాలి



పెంబి మండలం చాకిరేవు గ్రామ సమస్యలు అధికారులు వెంటనే తీర్చాలి. ఈ గ్రామంలో కరెంటు లేదు. గత కలెక్టర్ గ్రామస్తుల కోసం బోరు వేయించినా ఫలితం లేకపోయింది. తాగడానికి నీరు లేక గ్రామస్తులు విలవిలలాడుతున్నారు. మండలంలోని పసుపుల బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. సమస్యలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే మాపై క్రిమినల్ కేసులు పెడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.

– జానుబాయి, పెంబి జెడ్పీటీసీ

రేషన్ బియ్యం రీసైక్లింగ్



జిల్లాలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ జోరుగా జరుగుతోంది. గత సమావేశంలో కూడా ఈ అంశాన్ని సభ దృష్టికి తెచ్చాను. బాధ్యులపై చర్య తీసుకోలేదు. కొందరు రైస్‌మిల్లరు ఈ దందాతో కోట్లు సంపాదిస్తున్నారు. హాస్టళ్లు, పాఠశాలలకు నాసిరకం బియ్యం సరఫరా చేస్తున్నారు. కొందరు అసైన్డ్ భూములను కమర్షియల్ భూములుగా విక్రయిస్తున్నారు. వీరిపై చర్య తీసుకోవాలి.

– జీవన్ రెడ్డి, సోన్ జెడ్పీటీసీ

డయాలసిస్ సెంటర్ ప్రారంభించండి



భైంసా ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభించాలి. రోగులు నిజామాబాద్, నిర్మల్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ధరణి సమస్యతో నియోజకవర్గంలో సుమారు 500 మందికి రైతుబంధు రావడం లేదు. మంత్రి చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలి. – విఠల్ రెడ్డి ఎమ్మెల్యే ముధోల్

కరెంటు కోతలు ఆపాలి



వ్యవసాయానికి కోతలు లేని కరెంటు సరఫరా చేయాలి. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. అప్రకటిత కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నాయి. రైతుల సమస్యలు సభ దృష్టికి తీసుకురాకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు. మంత్రిగారు క్షేత్రస్థాయికి వస్తే రైతుల బాధ అర్థమవుతుంది. – ఆప్కా గజారాం ఎంపీపీ, కుంటాల

తెలంగాణలో ఆలయాలకు మహర్దశ

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



బాబాపూర్‌లో కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

లక్ష్మణచాంద: ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాకే తెలంగాణలో దేవాలయాలకు మహర్దశ వచ్చిందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామంలో అత్యంత పురాతన ఆలయమైన శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం వద్ద రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి మంగళవారం ప్రారంభించారు. తాను దావాదాయ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించాక మండలంలోని బాబాపూర్ గ్రామానికే రూ.1.58 కోట్లు ఇచ్చామన్నారు. సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు, ఆలయం వద్ద షెడ్డుకు రూ.10 లక్షలు, కల్యాణ మండపానికి రూ.50 లక్షలు, కోనేరుకు రూ.33 లక్షలు, ఆలయ అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు, హనుమాన్ ఆలయానికి రూ.10 లక్షలు, మల్లన్న స్వామి ఆలయానికి రూ.17 లక్షలు, భీమన్న ఆలయాలకు రూ.15 లక్షల చొప్పున రెండు ఆలయాలకు రూ.30 లక్షలు ఇచ్చినట్లు వివరించారు. లక్ష్మణచాంద మండలంలో 73 ఆలయాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇందులో 40 ఆలయాలు ఇప్పటికే పూర్తి అయ్యాయని, 18 ఆలయాల పనులు నడుస్తున్నాని తెలిపారు. వీటికి రూ.10 కోట్ల ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంపీటీసీ గణేశ్, బీఆర్ఎస్ జిల్లా కారదర్శి అడ్వాల రమేశ్, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు అట్ల రాంరెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు గంగారాం పాల్గొన్నారు.

దిలావర్‌పూర్‌లో ఎల్లమ్మ ఆలయానికి భూమిపూజ

దిలవార్‌పూర్: మండల కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించే ఎల్లమ్మ ఆలయానికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి భూమిపూజ చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన భీమన్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, రమణారెడ్డి, సుభాష్‌రావ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

భగీరథ.. తీరని వ్యథ



పైచిత్రం ఏపీనగర్‌లోనిది. కాలనీలో మున్సిపల్ బోరు చెడిపోయింది. మిషన్ భగీరథ పైపులైన్ పనులు పూర్తి కాకపోవడంతో నీరు సరఫరా కావడం లేదు. దీంతో కాలనీవాసులు నీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో బోరు ఉన్నవారిని ప్రాధేయపడి ఇలా నీటిని పట్టుకుంటున్నట్లు కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- శివారు కాలనీల్లో తాగునీటికి కటకట
- వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందో అని ఆందోళన
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

భైంసాటౌన్: పట్టణంలోని శివారు కాలనీల ప్రజలు వేసవికి ముందే తాగునీటికి తండ్లాడుతున్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు వచ్చినా.. నీటి సరఫరా కాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రధాన పైప్‌లైన్ ద్వారా కొన్ని ప్రాంతాలకు నీరు సరఫరా అవుతున్నా.. అంతర్గత కాలనీల్లో ఇప్పటికీ నీరందడం లేదు. దీంతో దూరం నుంచి నీరు తెచ్చుకుంటున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు. మరికొందరు బోరు ఉన్నవారిని ప్రాధేయపడి నీటిని వాడుకుంటున్నట్లు చెబుతున్నారు. కాలనీల్లో మున్సిపల్ బోరుమోటార్లున్నా.. అవి చెడిపోవడంతో నీటికి అవస్థలు పడుతున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు.

వేసవిలో పరిస్థితి ఎలా..

శివారు కాలనీలైన ఏపీనగర్, గోపాల్‌నగర్, శివాజీనగర్, పిప్రికాలనీ, తదితర కాలనీల ప్రజలు ఏటా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. వేసవికి ముందే పరిస్థితి ఇలా ఉంటే.. వేలవిలో ఎలా ఉంటుందో అని ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో సాధారణ రోజుల్లో బోరు మోటార్లతో నీటి కొరత తీరుస్తుండగా, వేసవిలో బోర్లు తరచూ చెడిపోతున్నాయి. దీంతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేవారు. ఈసారి మిషన్ భగీరథ పనులు చేపడుతుండగా, దాదాపు అన్ని కాలనీల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారు. కానీ నీటి సరఫరా ప్రారంభించకపోవడం, బోరు మోటార్లు చెడిపోవడంతో సమస్య ఏర్పడుతోంది. సొంత ఖర్చులతో పలుమార్లు మరమ్మతులు చేయించానని వార్డు కౌన్సిలర్ చందూలాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం వేసవి సమీపిస్తున్నా నీరు అందకపోవడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారంరోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్య తీర్చాలని అధికారులను కోరుతున్నారు.



దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న మహిళ

దూరం నుంచి తెచ్చుకుంటున్నం

మా కాలనీలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇచ్చా రు. కానీ నీరు సరఫరా చేస్తలేరు. దీంతో దూరం నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. మున్సిపల్ బోరు తరచూ పాడవుతోంది. మున్సిపల్ అధికారులు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించాలి. – రాధ, ఏపీనగర్‌వాసి

భగీరథ నీరు రావడం లేదు..

వార్డు పరిధిలోని ఏపీనగర్, శివాజీనగర్, పిప్రి కాలనీల్లో దాదాపు 2,500 జనాభా ఉంది. మున్సిపల్‌కు చెందిన బోరు మోటార్లు తరచూ పాడవుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్, నల్లా కనెక్షన్ పూర్తయినా నీరు రావడం లేదు

– చందూలాల్, 4వ వార్డు కౌన్సిలర్

శెనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

సాక్షి కథనానికి స్పందన

భైంసా: జిల్లాలో ఎనిమిది శెనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. శెనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు క్షేత్రస్థాయిలో పడుతున్న ఇబ్బందులపై ‘కోతలు షురూ.. కొనుగోళ్లు లేవు..!’ శీర్షికన ‘సాక్షి’లో మంగళవారం ప్రచురించిన కథనానికి కలెక్టర్ స్పందించారు. కలెక్టరేట్‌లో మార్కెటింగ్ శాఖ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం భైంసా, కుభీర్, తానూర్, ముధోల్, బాసర, మాటేగాం, సారంగాపూర్, నిర్మల్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. క్వింటాల్‌కు రూ.5,335 మద్దతు ధర చెల్లిస్తామని పేర్కొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు వేళాయె

- నేటి నుంచి పరీక్షలు
- జిల్లాలో మొత్తం 41 సెంటర్లు
- హాజరుకానున్న 6,789 మంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

వివరాలు..

జిల్లాలోని మొత్తం కళాశాలలు	61
ప్రయోగ పరీక్షలు నిర్వహించే కళాశాలలు	41
పరీక్షలు హాజరయ్యే విద్యార్థులు	4,407
పరీక్షలు హాజరయ్యే ఒకేషనల్ విద్యార్థులు	2,382



లోకేశ్వరం మండల కేంద్రంలోని కళాశాలలో సిద్ధం చేసిన ప్రయోగశాల

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జంబ్లింగ్ పద్ధతిలో ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తామని గతంలో ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. కానీ ఈ సంవత్సరం కూడా ఎప్పటిలాగే ఎవరి కళాశాలలో వారు నిర్వహించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు లబ్ధి పొందుతారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేట్ యాజమాన్యాలు తమ విద్యార్థులకు ఇష్టారీతిన మార్కులు వేసే అవకాశం ఉంది. ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడితో ప్రభుత్వం జంబ్లింగ్ విధానం అమలు చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

పరీక్షలకు 6,789 మంది..

జిల్లాలో 61 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 12 ప్రభుత్వ కళాశాలలు, 26 గవర్నమెంట్ సెక్టార్ కళాశాలలు, 23 ప్రైవేట్ కళాశాలలు. ఈసారి 41 కళాశాలలల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో 37 కాలేజీల్లో జనరల్ విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 4 కాలేజీల్లో ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 4,407, ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 1,235 మంది సెకండియర్ విద్యార్థులు 1,147 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వృత్తి విద్య, ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ కళాశాలలో ప్రయోగాలు నిర్వహించడానికి ప్రభుత్వం అంతంత మాత్రంగానే నిధులు విడుదల చేయడంతో ప్రయోగాలు నామమాత్రంగా నిర్వహించారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రయోగ పరీక్షల్లో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అవకతవకలకు ఆస్కారం లేకుండా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు.

మూడు విడతల్లో పరీక్షలు..

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈసారి మూడు విడతల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి విడత ఈనెల 15 నుంచి 20 వరకు 18 కేంద్రాల్లో, రెండో విడత ఈనెల 20 నుంచి 25 వరకు 10 కేంద్రాల్లో, మూడో విడత ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు 13 కేంద్రాల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రాన్ని పరీక్ష సమయానికి అరగంట ముందు సంబంధిత కేంద్రాల ఇన్‌చార్జీలు కోడింగ్, ఓటీపీ ద్వారా సీసీ కెమెరాల నిఘాలో డౌన్‌లోడ్ చేస్తారు. అనంతరం దానిని జిరాక్స్ తీసి విద్యార్థులకు అందజేస్తారు. పరీక్ష ముగిసిన రోజే మార్కుల జాబితా ఇంటర్మీడియట్ బోర్డుకు పంపిస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షలు బుధవారం నుంచి వచ్చేనెల 2 వరకు జరుగుతాయి. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రయోగాలు చేయాలి. పరీక్ష కేంద్రాలలో అన్ని సౌకర్యాలు సమకూర్చాం. హాల్ టికెట్లను సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ నుంచి తీసుకోవాలి. విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వని కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

– పరశురాం, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

క్లుప్తంగా

గంజాయి పట్టివేత

నార్నూర్: మండల కేంద్రంలో గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రేంకుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన రాథోడ్ అజయ్, రాథోడ్ శివతో పాటు మరో ఇద్దరు మైనర్లను గంజాయితో సహా పట్టుకుటున్నట్లు తెలిపారు. వారి నుంచి 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


లభ్యమైన మృతదేహం

భైంసా: బాసర గోదావరి రెండో ఘాట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

తాంసి: మద్యం మత్తులో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వామన్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేస్రం సుదర్శన్–నీలాబాయి దంపతులు వ్యవసాయ కూలీలు. వీరి కుమారుడు శ్రీనివాస్(22) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై కేశవ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్


కోచ్ రాజుతో సపావత్ రమ్య

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి సపావత్ రమ్య మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న రెండో ఖేలో ఇండియా జాతీయ మహిళల పోటీల్లో జూడో క్రీడలో స్వర్ణ పతకం సాధించింది. డీవైఎస్వో వెంకటేశ్వర్లు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్దన్ రెడ్డి, పార్థసారథి, కోచ్ రాజు అభినందించారు.

ఎస్సైని గాయపరిచిన యువకుడి అరెస్ట్


పోలీసుల అదుపులో యువకుడు

ఆదిలాబాద్ టౌన్: ఎస్సైని గాయపర్చిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ సమీపంలో సోమవారం రాత్రి ఎస్సై కలీం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన సద్దాం అనే యువకుడు ఎస్సైని నెట్టివేయగా గాయాల పాలయ్యారు. మద్యం మత్తులో యువకుడు దురుసుగా ప్రవర్తించడంతోనే ఎస్సైకి గాయాలైనట్లు తెలిపారు. ఈ మేరకు యువకుడిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఐటీడీఏ పీవోగా వచ్చేదెవరో?

- వరుణ్‌రెడ్డి బదిలీతో ప్రాజెక్టు ఆఫీసర్ పోస్టు ఖాళీ
- ప్రచారంలో వరుణ్‌రెడ్డి సతీమణి పేరు
- మరో కీలక అధికారి సైతం జోరుగా పైరవీ?


ఐటీడీఏ కార్యాలయం

ఉట్నూర్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థకు ప్రాజెక్టు అధికారిగా ఎవరు వస్తారోననే ఉత్కంఠ ఏజెన్సీలో నెలకొంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహిస్తున్న వరుణ్‌రెడ్డిని నిర్మల్ కలెక్టర్‌గా నియమించిన విషయం విధితమే. ఐటీడీఏకు ప్రాజెక్టు అధికారిగా ఎవరినీ నియమించకపోవడంతో ప్రస్తుతం ఇన్‌చార్జీగా వరుణ్‌రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పీవోగా వరుణ్‌రెడ్డి సతీమణి, కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వస్తారని ప్రచారం ఉంది. అలాగే ఐటీడీఏలో కీలక పోస్టులో కొనసాగుతున్న ఓ అధికారి సైతం ప్రాజెక్టు అధికారిగా వచ్చేందుకు జోరుగా పైరవీ చేస్తున్నట్లు సమాచారం.

ఐటీడీఏనే కీలకం...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ఉట్నూర్ ఐటీడీఏనే కేంద్ర స్థానం. ఐటీడీఏ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 38 మండలాలు ఉన్నాయి. ఇందులో ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలు పూర్తిస్థాయి ఏజెన్సీ మండలాలు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 4.95 లక్షల ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతోంది. అయితే కొంతకాలంగా ఐటీడీఏకు పీవోగా వస్తున్న అధికారులు కనీసం రెండేళ్లు గడవకుండానే బదిలీపై వెళ్తుండడంతో పాలన గాడి తప్పుతుందనే ఆరోపణలున్నాయి.

వరుణ్‌రెడ్డి బదిలీతో...

ఐటీడీఏ పీవోగా వరుణ్‌రెడ్డిని ప్రభుత్వం గతేడాది జూన్ 13న నియమించింది. అయితే జనవరి 31న ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆయనను నిర్మల్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీడీఏకు కొత్త పీవోగా ఎవరినీ నియమించకపోవడంతో వరుణ్‌రెడ్డికే ఇన్‌చార్జి బాధ్యతలూ అప్పగించింది. ఓవైపు కలెక్టర్‌గా, మరోవైపు పీవోగా ఇన్‌చార్జి బాధ్యతల నేపథ్యంలో ఐటీడీఏ పాలనపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ఆదివాసీ, గిరిజన నాయకులు అంటున్నారు. పూర్తిస్థాయి పీవోను త్వరగా నియమించాలని వారు కోరుతున్నారు.

ఇద్దరిలో ఎవరో..?

ఓవైపు వరుణ్‌రెడ్డి సతీమణి, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని ప్రభుత్వం పీవోగా నియమిస్తుందని కొద్ది రోజులుగా ఏజెన్సీలో ప్రచారం సాగుతుంది. మరోవైపు ఐటీడీఏలో కొద్ది నెలల క్రితం కీలక బాధ్యతలు చేపట్టిన ఓ అధికారి సైతం పీవోగా వచ్చేందుకు జోరుగా పైరవీ చేస్తున్నట్లు ప్రచారం ఉంది. సదరు అధికారికి ఉమ్మడి జిల్లాలోని ఓ మాజీ ఎమ్మెల్యే అండదండలున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సదరు అధికారికి చెందిన ఫైల్ ప్రభుత్వ పెద్దల వద్ద ఉందని, వారం పది రోజుల్లో ఉత్తర్వులు కూడా వెలువడుతాయని ఐటీడీఏలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఇద్దరిలో ఎవరికైనా పీవోగా బాధ్యతలు అప్పగిస్తుందా.. లేక కొత్తవారిని తీసుకువస్తుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ తీగలు


బూరుగుపల్లి(కే) గ్రామంలో ఓ ఇంటిపై తెగిపడిన 11 కేవీ వైర్లు

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(కె) గ్రామంలో మంగళవారం సాయంత్రం పలువురి ఇళ్లపై హైటెన్షన్(11కేవీ) విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వెంటనే గ్రామస్తులు సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. గతంలో కూడా రెండుసార్లు 11 కేవీ తీగలు తెగిపడ్డాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఇళ్ల పైనుంచి 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయిని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని పేర్కొన్నారు. పల్లె ప్రగతిలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు తొలగిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఊరంతా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి 11 కేవీ తీగలను ఇళ్ల పైనుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

గుర్తు తెలియని బాలుడి అప్పగింత


బాలుడితో సీడీపీవో నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్

భైంసాటౌన్: బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఓ గుర్తుతెలియని బాలుడిని ఐసీడీఎస్ అధికారులు పట్టణంలోని వివేకానంద ఆవాసంలో అప్పగించారు. కుభీర్ సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ అనసూయ మంగళవారం భైంసా నుంచి నిర్మల్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. తిరిగి భైంసాకు వస్తున్న క్రమంలో ఓ బాలుడు కనిపించడంతో చిరునామా కోసం ఆరా తీసింది. బాలుడు వివరాలు తెలుపకపోవడంతో భైంసాలోని సీడీపీవో కార్యాలయంలో సీడీపీవో నాగలక్ష్మి దృష్టికి తీసుకురాగా, వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాలుడి వివరాలు నమోదు చేయించారు. అనంతరం స్థానిక వివేకానంద ఆవాసంలో అప్పగించారు. బాలుడి కుటుంబీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని సూచించారు.



పుల్వామా అమరులకు నివాళి

జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడ కాలనీలో పుల్వామా అమరవీరులకు మంగళవారం రాత్రి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో జోహార్లు అర్పించారు. – నిర్మల్‌టౌన్

మేక పిల్లలను చంపిన గుర్తుతెలియని వ్యక్తి


మృతిచెందిన మేక పిల్లలు

తానూరు: మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన జంగు రమేశ్‌కు చెందిన ఏడు మేక పిల్లలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చంపేశారని ఎస్సై విక్రమ్ తెలిపారు. రమేశ్ రోజులాగే మేక పిల్లలను గ్రామ సమీపంలో ఉన్న పశువుల కొట్టంలో ఉంచాడు. రాత్రి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు 7 మేక పిల్లలను చంపేశారు. మంగళవారం ఉదయం మేక పిల్లలు చనిపోయి ఉండడంతో కావాలనే చంపారన్న అనుమానంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

ఊరకుక్కల దాడిలో రెండు పొట్టేళ్లు మృతి


మృతిచెందిన పొట్టేలును చూపుతున్న బాధితురాలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేట గ్రామంలో ఊరకుక్కలు దాడిలో రెండు గొర్రె పొట్టేళ్లు మృతిచెందాయి. గ్రామంలోని ఊరుమెట్ల భీమయ్యకు చెందిన రెండు పొట్టేళ్లు ఇంటి వద్ద కట్టేసి ఉంచగా, ఊర కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఈ ఘటనతో తనకు రూ.20 వేలకుపైగా నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పరిహారం చెల్లించేలా చూడాలని కోరాడు.

పొట్టేలు అపహరణ

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఏనుగుల రాములు విలువైన చోరీ అయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి ఏడాది క్రితం రూ.30 వేలకుపైగా వెచ్చించి పొట్టేలును కొనుగోలు చేసి తెచ్చాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు కొట్టంలోని మంద నుంచి ఆ పొట్టేలును ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పొట్టేలు కనిపించకపోవడంతో ఆందోళన చెందాడు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని పేర్కొన్నాడు. 2017లోనూ తమ కొట్టంలోని ఆరు మేకలు చోరీ అయ్యాయిని తెలిపాడు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశానని అయినా దొంగలను పట్టుకోలేదని వెల్లడించాడు. ఇప్పటికైనా పోలీసులు విచారణ చేసి దొంగలను పట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరాడు.

ధన్నూర్‌లో దొంగల అలజడి

బోథ్: మండలంలోని ధన్నూర్ బీ గ్రామంలో దొంగలు అలజడి సృష్టించినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. సోమవారం రాత్రి రెండు ఇళ్ల తలుపులు పగులగొట్టినట్లు తెలిపారు. కాగా, గ్రామస్తులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రవీందర్ సూచించారు.

హింగోలి ఎంపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు


ఎంపీ హేమంత్ పటేల్‌తో బాసర బీఆర్‌ఎస్ నాయకులు

భైంసా: మహారాష్ట్రలోని హింగోలి ఎంపీ హేమంతపటేల్‌ను బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కలిశారు. అక్కడి హోటల్‌లో ఎంపీని కలిసి బీఆర్‌ఎస్ పార్టీ ప్రణాళికలపై చర్చించారు. ఎంపీని కలిసిన వారిలో బాసర సర్పంచ్ లక్ష్మణ్‌రావ్, మండలాధ్యక్షుడు జిడ్డు మల్లయ్యయాదవ్, నాయకులు రాజు దేశాయ్ తదితరులు ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్

భైంసాటౌన్: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ పరీక్ష కేంద్రాల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. భైంసాలోని రెండు కేంద్రాల్లో మాల్‌ప్రాక్టీస్ చేస్తూ విద్యార్థులు పట్టుబడినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారి ప్రకటించారు. బీఏ/బీఎల్, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ, వొకేషనల్ మొదటి సెమిస్టర్ పరీక్షలు అలాగే ఎంఎస్సీ(పీజీ) మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండగా, భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 19 మంది, జీపీఎల్ డిగ్రీ కళాశాలలో 07 మంది మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.

జెడ్పీ సమావేశానికి డుమ్మా




జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన జెడ్పీ సమావేశానికి పలువురు సభ్యులు, అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో ప్రజా సమస్యలు చర్చించే సమావేశ మందిరంలో కుర్చీలు ఖాళీగానే దర్శనమిచ్చాయి. మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి మూడు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవ్వాలి. కానీ జిల్లాలోని 18 మండలాలకు గాను 13మంది జెడ్పీటీసీలు, ఆరుగురు ఎంపీపీలు మాత్రమే హాజరయ్యారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, కొందరు అధికారులు కూడా రాలేదు. దీంతో కొత్త కలెక్టర్ వరుణ్‌రెడ్డి.. ఇక నుంచి జరిగే సమావేశాలకు ప్రతి అధికారి హాజరుకావాలని సమావేశంలోనే హెచ్చరించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

టెంట్‌హౌస్‌లో అగ్ని ప్రమాదం


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై, తహసీల్దార్

నిర్మల్ రూరల్: మండలంలోని కొండాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి టెంట్‌హౌస్, లైట్ హౌస్ గోదాం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగాపురం పోశెట్టి టెంట్‌హౌస్ నిర్వహిస్తుండగా, అదే గ్రామానికి చెందిన రమణ డీజే లైట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు. వీరిద్దరూ కలిసి ఓ గోదాం తీసుకొని అందులో సామగ్రి నిల్వ చేస్తున్నారు. సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గోదాంలో మంటలు చెలరేగి సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. రూరల్ తహసీల్దార్ ప్రభాకర్, ఎస్సై చంద్రమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా చేశారు. రూ.7 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బేకరీలో అగ్నిప్రమాదం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో ఉన్న ఓ బేకరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం దుకాణంలోని విద్యుత్ మీటర్ నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పేశారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ప్రమాదం జరిగిన బేకరీని పరిశీలించారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామంలోని పురాతన శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. బాబాపూర్, నర్సాపూర్, వడ్యాల్, రాచాపూర్, కంజర్ గ్రామాల నుంచి భక్తులు కల్యాణం తిలకించేందుకు వచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైరపర్సన్ విజయలక్ష్మి, ఎంపీటీసీ గణేశ్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మంత్రి సోదరుడు అల్లోల సురేందర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీవిద్య, ఆలయ కమిటీ చైర్మన్ సురేశ్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న రైతు

తాంసి: తాంసి మండల కేంద్రానికి చెందిన ఓ రైతు నిజాయతీని చాటుకున్నాడు. పంట చేన్లకు వెళ్లే క్రమంలో రోడ్డుపై దొరికిన స్మార్ట్ ఫోన్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి అందజేశాడు. భీంపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహించే అశోక్ మంగళవారం తాంసి గ్రామం మీదుగా విధులకు బైక్‌పై వెళ్లాడు. ఈ క్రమంలో తాంసి గ్రామ శివారులోని పంట చేన్ల సమీపంలో స్మార్ట్‌ఫోన్ పడిపోయింది. పంట చేనులోకి వెళ్తున్న రైతు వన్నెల రామన్నకు ఈ స్మార్ట్‌ఫోన్ దొరికింది. గ్రామస్తులకు ఫోన్ దొరికిన విషయం తెలియజేయగా వారు ఆరా తీశారు. ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఆర్ఐ అశోక్‌గా గుర్తించి గ్రామస్తుల సహకారంతో రైతు రామన్న అతడికి మొబైల్ అందజేశాడు. నిజాయతీ చాటుకున్న రైతును గ్రామస్తులు అభినందించారు.

'నంబర్ ప్లేట్ లేకుంటే వాహనం సీజ్'

భైంసాటౌన్: వాహనదారులు తప్పనిసరిగా నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని, లేనిపక్షంలో వాహనం సీజ్ చేస్తామని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ హెచ్చరించారు. సీఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం సాయంత్రం బస్టాండ్ ఎదుట వాహనాలు తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.


వాహనం తనిఖీ చేస్తున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ ప్రవీణ్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


ధర్మన్న (ఫైల్)

తానూరు: మండలంలోని హిప్నెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎల్వి గ్రామానికి చెందిన జొరిగల్ ధర్మన్న(52) ద్విచక్రవాహనంపై ముథోల్ నుంచి ఎల్విికి వెళ్తున్నాడు. హిప్నెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఇటుకలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ధర్మన్న వెనుక నుంచి ఢీకొని రోడ్డుపై పడ్డారు. హెల్మెట్ లేకపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతున్ని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ధర్మన్నకు భార్య చంద్రకళ, కూతురు, కుమారుడు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): తిర్యాణి మండలంలోని ఖైరిగూడ ఓసీపీ వెళ్లే దారిలో పావురాల గుట్ట సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చోపిడి గ్రామానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తిర్యాణి మండలం చోపిడి గ్రామానికి చెందిన టేకం మారుతి, టేకం భీంరావు సొంత పని నిమిత్తం గోలేటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో పావురాలగుట్ట సమీపంలోకి రాగానే ఖైరిగూడ వైపు నుంచి గోలేటి వైపు వెళ్తున్న జేసీబీ ఎదురుగా ఆటోను ఢీకొట్టింది. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ మారుతి తలకు, వెనుక కూర్చున్న భీంరావ్ ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సిబ్బందితోపాటు రెబ్బెన ఎస్సై భూమేశ్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 ఈఎంటీ శవంత, పైలెట్ సంతోష్ హుటాహుటిన క్షతగాత్రులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.